క్లుప్తంగా

కొనసాగుతున్న తిరునాళ్ల మహోత్సవాలు



నందిగామ: మండలంలోని లింగాలపాడు శ్రీలక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారికి విశేష పూజలు చేశారు. సాయంత్రం సమయంలో గ్రామ శిలల బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఆయా కార్యక్రమాల్లో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఎలుకల నివారణపై రైతులకు అవగాహన

నందిగామ: పంట పొలాల్లో ఎలుకల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు మండలంలోని పల్లగిరి గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించారు. జాతీయ సేవా పథకంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పల్లగిరిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులోభాగంగా పంటపొలాల్లో ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, శేషారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

వీరులపాడు: మండలంలోని పెద్దాపురం గ్రామశివారులో ఎస్‌ఐ మహాలక్ష్మణుడు శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్నంగా తనిఖీ చేయడంతోపాటు ఆయా ధ్రువీకరణపత్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చందనం అలంకారంలో కాళీమాత అమ్మవారు



కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో కాళీమాత అమ్మవారు రోహిణి కార్తె సందర్భంగా శనివారం చందనం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి చందనంతో అలంకరించారు. అనంతరం చక్రపూజ, అర్చన, హారతులు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు చందనం అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు బీహెచ్ విజయ్‌కిరణ్, సూపరింటెండెంట్ ఎ.మధుసూదనరావు, కమిటీ సభ్యులు జి.సత్యనారాయణ, ఎం.రాజా తదితరులు పర్యవేక్షించారు.

శిక్షణ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు అందజేత

లబ్బీపేట(విజయవాడతూర్పు): ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ వారి మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో 32 రోజులు హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసిన వారికి శనివారం ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. వాహనంపై నియంత్రణ ఉండాలంటే డ్రైవర్లు గంటకు 50 కి.మీ. మించకుండా పరిమిత వేగంతో నడపాలని, సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మోడల్ డ్రైవింగ్ స్కూల్‌కు దుర్గాప్రసాద్ వాటర్ ట్యాంకర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా, ఉపాధ్యక్షుడు కాజ వెంకటసత్య చలపతిరావు, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీరవెంకట సత్యనారాయణ, కార్యదర్శి రావి శరత్‌బాబు, కోశాధికారి పొట్లూరి చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనలు

విజయవాడ కల్చరల్: వినరోభాగ్యము విష్ణు కథ, అదివో అల్లదివో శ్రీహరివాసము అంటూ సంగీత విద్వాంసులు భక్తిగా అన్నమయ్య కృతులను మధురంగా గానం చేస్తున్నారు. శ్రీ వెంకటేశ్వరా సంకీర్తనా అకాడమీ, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య 616వ జయంతి ఉత్సవాలు లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శనివారం నాటి కార్యక్రమాలు ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యాయి. ఖాజీపేటకు చెందిన నాదసుధా తరంగణిబృందం, స్వరవాహిని, సిద్ధార్థ మ్యూజిక్ అకాడమీ బృందాలు, సంగీతవిద్వాంసులు వేమూరి విశ్వనాథ్, కేవీ బ్రహ్మానందరావు, తుషార పూర్ణవల్లి, పోపూరి గౌరీనాథ్, కె.లక్ష్మీనరసమ్మ, బుర్రా నీలకంఠ శాస్త్రి, సుధా కౌముది అన్నమాచార్య సంకీర్తనలను గానం చేశారు. సంస్థ నిర్వాహకులు ప్రసాద్, సత్యబాబు నిర్వహించారు.

పౌరసేవల కేంద్రం..సచివాలయం

- సచివాలయాల ద్వారా 600 పౌరసేవలు
- జగ్గయ్యపేట నియోజకవర్గంలో 77 సచివాలయాలు
- ప్రతి సచివాలయంలో పదిమంది ఉద్యోగులు
- ప్రజల ముంగిటకే పాలన
- సాకారమైన గ్రామస్వరాజ్యం కల



పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు (ఫైల్)

పెనుగంచిప్రోలు: దశాబ్దాలుగా కలగానే ఉన్న గ్రామస్వరాజ్యం ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారమైంది. సమస్య ఏదైనా గ్రామ, వార్డు సచివాలయంలోనే పరిష్కారమవుతోంది. రేషన్‌కార్డు కావాలన్నా..జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు.. ట్రేడ్ లైసెన్స్‌లు ఇలా అన్నిరకాల పౌరసేవలకు సచివాలయం కేరాఫ్ అడ్రస్‌గా మారింది. గతంలో మాదిరి ప్రజలు తమ సమస్యల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా, గ్రామ పొలిమేర దాటి అవసరం కూడా లేకుండానే ఆయా పౌరసేవలు ప్రజలకు గడప ముంగిటనే అందుతున్నాయి. ఇలా గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సాకారమైంది.

దేశానికే దిక్సూచిగా..

గ్రామ స్వరాజ్య పాలన దిశగా రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల్లో ప్రధానమైనది సచివాలయ వ్యవస్థ. ప్రతి వార్డు, గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజల సమస్యలను అక్కడే సులువుగా పరిష్కరించడంతోపాటు వారికి మెరుగైన సత్వర సేవలు అందేలా పనిచేస్తున్న సచివాలయ వ్యవస్థ దేశంలోనే మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా పనిచేస్తోంది. ఆదాయ, కుల, జనన ధ్రువీకరణపత్రాలు, రేషన్‌కార్డులు, ఓటరు కార్డులు, భూములకు సంబంధించి పత్రాల జారీతోపాటు అన్నిరకాల పన్నులు, కరెంటు, టెలిఫోన్ బిల్లుల చెల్లింపు వంటి దాదాపు 600 పౌరసేవలను సచివాలయాల ద్వారా ప్రజలు పొందుతున్నారు.



నవాబుపేట గ్రామ సచివాలయం

దళారీ వ్యవస్థకు చెక్..

సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతి, దళారీ వ్యవస్థకు చెక్ పడింది. గత ప్రభుత్వాల పాలనలో ప్రజలు ప్రతి పనికి మండల కేంద్రం, జిల్లా కేంద్రానికో ఎన్నో వ్యయప్రయాసల కోర్చి వెళ్లాల్సి వచ్చేది. సచివాలయ వ్యవస్థతో నేడు ఆపరిస్థితి పూర్తిగా మారింది. ప్రజలకు గ్రామంలోనే ఆయా సమస్యలకు పరిష్కారం లభిస్తుండటంతోపాటు వందలాది పౌరసేవలు అందుబాటులోకి ఉండటంపై గ్రామాల్లోని ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా అన్నిరకాల సేవలు ఇంటివద్దనే అందిస్తుండం ద్వారా ప్రజల ముంగిటకు పాలనను తీసుకువచ్చినట్టైంది.

ఎంతోమందికి ఉద్యోగావకాశాలు..

సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు వచ్చాయి. ప్రతి 50 నుంచి 100 ఇళ్లకు ఓ వలంటీర్ ఏర్పాటుతోపాటు ప్రతి సచివాలయంలో ఆయాశాఖలకు సంబంధించి 10మంది ఉద్యోగులు ఉన్నారు. గతంలో మండలానికి ఓ సర్వేయర్ ఉండగా. నేడు ప్రతి సచివాలయానికి ఓ సర్వేయర్ ఉన్నారు. ఇలా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని 77 సచివాలయాలన్నింటిల్లో కలిపి 770మందికి ఉద్యోగాలు లభించాయి. ఆయా సచివాలయాల్లో పనిచేస్తున్న వారిలో నియోజకవర్గానికే చెందిన ఉద్యోగులు 150మంది వరకు ఉండగా, పెనుగంచిప్రోలు మండలంలోని అనిగండ్లపాడుకు చెందిన యువతీయువకులే 30మంది వరకు ఉన్నారు. ఇలా సచివాలయ వ్యవస్థ ద్వారా స్థానికులకు ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. నిత్యం వందలాది మంది ప్రజలు సచివాలయ వ్యవస్థ ద్వారా సేవలు పొందుతున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అనేక పౌరసేవలు అందుతుండటంపై ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా సేవలు పొందినవారి అభిప్రాయాలు..వారి మాటల్లోనే..

గంటల వ్యవధిలో సమస్య పరిష్కారం



మాది మండలంలోని సుబ్బాయిగూడెం గ్రామం. నాకు పెళ్లి అయింది. వేరే చోట ఉంటాం. మా తల్లిదండ్రుల రేషన్‌కార్డులో నా పేరు ఉంది. ఆపేరు తొలగించుకునేందుకు జగనన్న సురక్ష పథకం కింద వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాను. గంటల వ్యవధిలో సమస్యను పరిష్కరించారు.

పాపినేని శామిలి, సుబ్బాయిగూడెం

అన్ని సేవలు అందుతున్నాయి..



ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచిలయాల ద్వారా అన్ని రకాల సేవలు అందుతున్నాయి. గతంలో కరెంట్ బిల్లుల చెల్లింపుతోపాటు ఆయా పనుల కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేంది. ఇప్పుడు మాఇంటి దగ్గరలోనే ఉన్న సచివాలయం ఉండటంతో అన్ని రకాల పౌరసేవలు అందుబాటులోకి వచ్చాయి.

నంచర్ల కృష్ణమూర్తి, పెనుగంచిప్రోలు

ఎంతో మేలు చేకూరింది..



గతంలో ఏపని కావాలన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ రోజుల తరబడి తిరిగినా పని జరిగేది కాదు. సీఎం జగనన్న తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మేలు జరిగింది. రూపాయి లంచం లేకుండా పథకాలు, సేవలు అందుతున్నాయి.

కృష్ణవేణి, కె.పొన్నవరం

ఆక్రమణల తొలగింపుపై సమీక్ష



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ప్రధాన వీధుల్లో మురుగు కాల్వలపై ఉన్న ఆక్రమణల తొలగింపునకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని శానిటేషన్, టౌన్ ప్లానింగ్ కార్యదర్శులతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ మురుగుకాల్వలను ఆక్రమణలతో మురుగు తొలగింపునకు ఇబ్బందులు ఎదురవుతున్నందున వెంటనే ఆయా కాల్వలపై ఉన్న షాపులు, ఇతర నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. పలువురు మురుగుకాల్వలపై కాంక్రీట్‌బండలు ఏర్పాటు చేయగా, మరికొందరు మెట్ల నిర్మాణం చేపట్టారన్నారు. దీంతో మురుగు తొలగింపు సమయంలో పారిశుద్ధ్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇటువంటి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి వెంటనే నోటీసులు జారీచేయాలన్నారు. నోటీసులకు స్పందించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా అక్రమ నిర్మాణాల తొలగింపునకు అయ్యే ఖర్చును కూడా సదరు నిర్మాణదారుల నుంచే వసూలు చేస్తామని కమిషనర్ తెలిపారు. ఇకనైనా మురుగుకాల్వలపై నిర్మాణాలు చేపట్టినవారు వెంటనే వాటిని స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మాగల్లులో పోలీసు కవాతు



మాట్లాడుతున్న నందిగామ ఇన్‌స్పెక్టర్ హనీష్

నందిగామ: గ్రామాల్లో ప్రతిఒక్కరూ సోదరభావంతో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని నందిగామ ఇన్‌స్పెక్టర్ హనీష్ సూచించారు. ఎన్నికల పోలింగ్ తర్వాత రాష్ట్రంలో పలుచోట్ల వివాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో మండలంలోని మాగల్లులో శనివారం పోలీసుకవాతు నిర్వహించారు. ఈసందర్భంగా హనీష్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్నికల పోలింగ్ సమయంలో మాదిరిగానే కౌంటింగ్ పూర్తయిన తర్వాత కూడా గ్రామాల్లో శాంతియుత వాతావరణం ఉండాలన్నారు. అందుకు గ్రామస్తులంతా సహకరించాలని కోరారు. అనవసర వివాదాలకుపోయి ఇబ్బందులు తెచ్చుకోవద్దని సూచించారు. పోలీసు కవాతులో ఎస్‌ఐ దుర్గామహేశ్వరరావు, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా మరియమాత గుహ వార్షికోత్సవం



బలుసుపాడు(జగ్గయ్యపేట అర్బన్): గ్రామంలోని రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చి వద్ద క్రైస్తవుల సహాయమాత పేరుతో నిర్మించిన మరియమాత గుహ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న జగ్గయ్యపేట విచారణ ఫాదర్ గుడిసె జయరాజు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మరియమాత ఆశీస్సులు పొందాలంటే ప్రతిఒక్కరూ పవిత్రమైన జీవన విధానాన్ని కలిగి ఉండాలని సూచించారు. తొలుత గ్రామంలోని వీధుల్లో మరియమాత విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట సెయింట్ ఆన్స్ సిస్టర్లు అనిత, భాగ్యలక్ష్మి, సుష్మ, ఉపదేశి అలోషియస్, సంఘపెద్దలు మేరీ వినీత, గండమాల సురేష్, కొరివి బాబురావు, ఉప్పుతోళ్ల బాలస్వామి, పోలంపల్లి దావీదు, సంఘస్తులు పాల్గొన్నారు.

తగ్గిన కౌలు ధరలు



కౌలుకు ఇచ్చేందుకు సిద్ధం చేసిన భూమి

వత్సవాయి : మండలంలో వ్యవసాయభూమి కౌలు ధరలు ఈ ఏడాది భారీగా తగ్గాయి. గతేడాది మిర్చి సాగులో పెట్టుబడులు పెరగడంతోపాటు పంట దిగుబడులు భారీగా తగ్గడం, ధరలు కూడా అంతంతమాత్రంగానే ఉండటంతో ఈసారి భూములను కౌలుకు తీసుకునేందుకు కౌలురైతుల్లో ఆసక్తి సన్నగిల్లింది. దీంతో భూముల కౌలుధరలు తగ్గిపోయాయి.

ఎకరం కౌలు రూ.15వేలు ..

గత నాలుగైదు ఏళ్లగా మిర్చికి మంచి ధర పలుకుతుండటంతో భూయజమానులు కౌలుధరలను పెంచేశారు. దీనికితోడు కౌలురైతులు కూడా పోటీలుపడి భూములను కౌలుకు తీసుకుని సాగుచేశారు. దీంతో నాలుగేళ్ల కిందట రూ.40వేలు పలికిన ఎకరం కౌలు గతేడాది రూ.25వేలు నుంచి రూ.30వేలు పలికింది. కౌలు నగదు కూడా ముందుగానే చెల్లించేవారు. అయితే ఈ ఏడాది ఆపరిస్థితులు కనిపించడం లేదు. దీంతో ఎకరం భూమి కౌలు ధర రూ.15వేలుగా పలుకుతోంది. మిర్చిసాగులో పెట్టుబడులు ఏటా పెరుగుతుండటం, గతేడాది దిగుబడులు తగ్గడంతోపాటు ధరలులేక రైతులు నష్టాలపాలు కావడం ఈ పరిస్థితికి కొంత కారణంగా కాగా, కౌలుకు భూములను తీసుకుని వ్యవసాయం చేసేవారి సంఖ్య కూడా ఏటా తగ్గిపోతుండటం కూడా కౌలుధరలు తగ్గిపోవడానికి మరో కారణమని చెప్పవచ్చు.

సబాబులు వేసేందుకు ఆసక్తి..

గతంలో కౌలు ధరలు తక్కువగా ఉండడంతో ఎక్కువ భూములు ఉన్న యజమానులు సుబాబుల్ పంటను సాగుచేశారు. మధ్యలో మిర్చికి మంచి ధర లభించడంతో కౌలు రేట్లు పెరిగాయి. దీంతో అత్యధికులు సుబాబుల్ పంటను తొలగించి మరీ భూములను కౌలుకు ఇచ్చారు. ప్రస్తుతం కౌలుధరలు తగ్గడంతో కొంతమంది రైతులు తిరిగి సుబాబుల్ పంటను వేసేందుకు ఆసక్తిచూపుతున్నారు.

విద్యార్థులకు యోగాపై శిక్షణ



కంచికచర్లలో యోగా నేర్చుకుంటున్న విద్యార్థులు

కంచికచర్ల : గ్రంథాలయంలో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు అల్లూరి రామచంద్రుడు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు యోగా, చెస్, డ్రాయింగ్‌పై శిక్షణనిచ్చారు. ఈసందర్భంగా రామచంద్రుడు మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులను వేసవి విజ్ఞాన శిబిరాలను పంపించాలని కోరారు. ఈ వేసవి శిక్షణ శిబిరాలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వరరావు, కవి నీలం సర్వేశ్వరరావు, ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, యోగా గురువు నవీన్ నాని, ఎం.మల్లికార్జునరావు, బీడీసీ నిర్వాహకుడు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో...

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులచే ముందుగా పుస్తక పఠనం చేయించారు. ఉపాధ్యాయుడు వినోద్‌కుమార్ ఇంగ్లిష్ గ్రామర్‌ను విద్యార్థులకు వివరించారు. నిర్మల కుమారి బేసిక్స్ మ్యాథ్స్ సంఖ్యాశాస్త్రంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది శ్యామల, రమేష్, సత్యవతి పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం



నందిగామ: నందిగామ ప్రాంతంలో శనివారం కారుమబ్బులు కమ్మేశాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఉదయం సమయంలో ఒక్కసారిగా పట్టణంలో వాతావరణం మారిపోయింది. కొద్దిసేపు ఒక మోస్తరు చిరుజల్లులు పడ్డాయి. ఈ చిరుజల్లుల కారణంగా వాతావరణం చల్లబడి ఆహ్లాదకరంగా మారడంతో ప్రజలు సేదతీరారు.

చెరువుమట్టితో.. చేనుకు చేవ

- సారవంతమవుతున్న భూములు
- చౌడు విరుగుడుకు చెరువు మట్టి మేలు



బీడు భూముల్లో తోలిన నల్లమట్టి

వత్సవాయి : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు తమ సాగు, బీడు భూములకు చెరువుల్లోని పూడికమట్టి, నల్లమట్టిని ముమ్మరంగా తరలిస్తున్నారు. ఆయా పంటల సాగు సమయంలో రైతులు పోటీలుపడి విచ్చలవిడిగా పురుగుమందులు, మందుకట్టలు వినియోగిస్తుండటంతో భూములు నిస్సారంగా మారి దిగుబడులు గణనీయంగా తగ్గపోతున్నాయి. దీంతో ఏటా పెట్టుబడులు కూడా అధికం అవుతున్నాయి. పంటపొలాలకు సేంద్రీయ ఎరువులను అందించకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఈనేపథ్యంలో మండలంలోని రైతులు ఇటీవల కాలంలో కొంత సేంద్రీయం వైపు మొగ్గుచూపుతున్నారు. చెరువుల్లోని పూడికమట్టి, నల్లమట్టిని కూడా పొలాలకు తరలిస్తూ భూములను సారవంతం చేసుకుంటున్నారు. చెరువుమట్టితో భూమి సారవంతం కావడంతోపాటు పంట ఆశాజనకంగా ఉండి దిగుబడులు పెరుగుతాయని రైతులు చెబుతున్నారు.

పంటపొలాలుగా బీడు భూములు...

గతంలో గ్రామాల్లో ఎక్కడ చూసినా బీడు భూములు కనపడేవి. గేదెలు, ఎద్దులకు మేత కోసం కొంతభూమిని బీడు భూములను ఉంచుకునేవారు. కానీ ప్రస్తుతం కాలం మారింది. భూములకు మార్కెట్లో గతంలో కంటే రేట్లు పెరిగిపోయాయి. గ్రామాల్లో సైతం ఎకరా ధర రూ.30లక్షల నుంచి రూ.40లక్షలు పలుకుతోంది. దీంతో రైతులు బీడు భూములను పంట పొలాలుగా మార్చేందుకు సిద్ధపడుతున్నారు. బీడు భూముల్లో ఉన్న చెట్లు, బండలను ప్రొక్లెయిన్ ద్వారా తొలగించి చదును చేస్తున్నారు. ఎక్కడ బీడు భూమి ఉన్నా సారవంతమైన చెరువు మట్టి నింపి పంటపొలంగా మార్చుతున్నారు. గ్రామాల్లో రైతులకు చెరువుమట్టి అనుకూలంగా దొరకడంతో బీడు భూములను పంటలసాగుకు అనువుగా మార్చుతున్నారు. చెరువుల వద్ద నుండి పొలానికి మధ్య ఉండే దూరాన్ని బట్టి ట్రాక్టర్లకు బాడుగ చెల్లిస్తున్నారు. ఒకసారి పంటపొలంగా మార్చితే భవిష్యత్‌లో ఇబ్బంది ఉండదనే ఉద్దేశ్యంతో కొంతమంది రైతులు ఎకరాకి వంద నుంచి 300 ట్రాక్టర్ల మేర చెరువుమట్టిని పోయిస్తున్నారు.

చెరువుమట్టితో కలిగే ప్రయోజనాలు...

- చెరువుమట్టిని పొలాలకు చెరువుమట్టిని తరలించడం ద్వారా ఆ పొలంలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. వర్షాలు తక్కువగా ఉన్న సమయంలో పంట త్వరగా వడబడకుండా ఉండేలా చూస్తుంది.
- చెరువుమట్టి తోలిన పొలాల్లో సేంద్రీయం పెరిగి రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది. దిగుబడులు కూడా పెరుగుతాయి.
- పూడికమట్టి, చెరువుమట్టితో పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి పంట ఎదుగుదలకు దోహదపడుతుంది.

నల్లమట్టితో చౌడు విరుగుతుంది...

చౌడుభూములను నల్లటి చెరువుమట్టిని నింపితే చౌడు విరిగిపోతుంది. ఎకరానికి కనీసం రెండు వందల ట్రాక్టర్ల మేర మట్టితో తోలితే చౌడు విరిగి పంటకు అనుకూలంగా ఉంటుంది. నల్లమట్టిలో తేమశాతం ఎక్కువ ఉండటంవల్ల పంటకు నీటితడులు కూడా పెద్దగా పెట్టాల్సిన అవసరం ఉండదు. చెరువులో ఉన్న ఒండ్రుమట్టి సారవంతం కావడంతో భూమికి బలం పెరుగుతుంది. రైతులు సాధ్యమైనంత వరకు చౌడు, బీడుభూముల్లో చెరువుమట్టి తోలుకుంటే మంచిది.

వి.రవికుమార్, వత్సవాయి వ్యవసాయాధికారి

29న యూకే ఎడ్యుకేషన్ ఫెయిర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎస్‌ఐ–యూకే ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 29న విజయవాడలో యూకే ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ఎం లక్ష్మీ అయ్యర్ తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నోవాటెల్ హోటల్‌లో జరిగే ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో 10 ప్రముఖ విశ్వ విద్యాలయాల ప్రతినిధులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. యూనివర్సిటీ కాలేజ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ సర్రే, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్, యూనివర్సిటీ ఆఫ్ వాల్వర్‌హాంప్టన్, లండన్ మెట్రోపాలిటన్ యూనివర్సిటీ, నార్తంబ్రియా యూనివర్సిటీ వంటి పలు వర్సిటీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఇక్కడ విద్యార్థులు తమ అకడమిక్ ఆఫర్లు గురించి సమగ్ర వివరాలను తెలుసుకోవచ్చునని తెలిపారు. యూకేలో అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను అన్వేషించడానికి విద్యార్థులకు అందించడం ఈ ఫెయిర్ లక్ష్యమన్నారు. విద్యార్థులు https://india. studyin-uk.com/eventsని సందర్శించడం ద్వారా ఉచిత సెషన్‌ను బుక్ చేసుకోవచ్చునని తెలిపారు.